# పారిపోతావా? ఎటు?

నాకు మళ్ళీ 'జబ్బు' చేసింది. 'జబ్బు' చెయ్యగానే- ఎప్పుడూ- చేసినట్టుగానే పరుగులు పెట్టుకుంటూ- మేడ మెట్లు దిగి వరండాలోని ఆ మంచం దగ్గర మోకాళ్ళ మీద కూర్చుని నోరు జాపాను.



ఎప్పటిలా- హోమియోపతి తియ్యటి మాత్రలు నా నోట్లో పడలేదు. ఉలిక్కిపడి "ఊహ" నుంచి వాస్తవం లోకి వచ్చాను. మంచం ఖాళీగా వుంది.

మంచానికి నిండుగా పట్టుకుని నిండుగా మనః స్ఫూర్తిగా నవ్వుతూ, ఆర్తిగా మాట్లాడే నాన్న ఆ మంచం మీద లేరు- అవును నాన్న లేరు.

నా 'జబ్బు' ఏమిటో దానికి ఏం మందు వేయాలో తెల్సిన నాన్న లేరు. ఏం చెయ్యాలి? ఈ జబ్బు ఎవరు నయం చేస్తారు? అసహనంగా వుంది. కారణం లేకుండానే అందరి మీదా కోపం వచ్చింది. నన్ను ఒంటరిగా కాదు కాదు నా మెళ్ళో ఒక మగాడి చేత తాళి కట్టించి- ఆ తాళి ద్వారా ఒక చక్కటి లంకిణీ లాంటి అత్తగార్ని, ఇద్దరు రాకాసి పిల్లల్ని, ఎనిమిది మంది నోటి ధాటీ వాటుగా వున్న ఆడపడుచుల్ని, దజనుఉద్దండపిండాలైన మేనల్లుళ్ళు, మేనకోడళ్ళని నాకు వదిలి, మొగుడి సంగతి సరేసరి ఆయన వెళ్ళిపోయారు.

వీళ్ళందర్నీ వరసగా తల్చుకోగానే- 'జబ్బు' మరింత ఎక్కువయ్యింది. ఈ జబ్బుతో ఇలాగే చచ్చిపోతానా? అనిపించింది. మా నాన్న లేరే?! అని బిగ్గరగా ఏడవాలనిపించింది.

కానీ ఏమీ చెయ్యలేక, పైపైన మౌనంగా వుండిపోయి, లోలోపల మధనపడ్తూ నే వున్నాను.

మొదలూ, దరీ, అంతం లేకుండా జబ్బు దినదిన ప్రవర్థమానం అయిపోతోంది.

ఇక భరించలేక పారిపోవాలనుకున్నా ఈ 'జబ్బు' నాకు చిన్నప్పటి నుంచీ వుంది. సంవత్సరంలో ఒకటి రెండు సార్లు వచ్చే ఈ 'జబ్బు'కి మా నాన్నే మందు వేస్తూ వుండేవారు.

ఇక ఇప్పుడు, వేరే దారిలేక పారిపోవాలనుకున్నా! కానీ ఎలా పారిపోగలను? ఎక్కడికిపారిపోగలను?

సడన్‌గా టెలిఫోన్ మ్రోగింది. "హలో ఎవరూ?"

"నేను' అని అవతల్నించి ఒక యువకుడి స్థిర నిశ్చలమైన కంఠస్వరం వినిపించింది.

"నేనంటే?!" అయోమయంగా అడిగాను.

"నేనే! ఆ 'నేను' ఎవరో మీకు ముందు ముందు తెలుస్తుంది లెండి!"

"సరే! ఫోనెందుకు చేసినట్టు? ఆ విషయం చెప్పడానికా?" నా స్వరంలో వ్యంగ్యం!

"మీకు నా అవసరం వుందని తెల్సి-" అదే స్థిరత్వం.

"ఎలా తెల్సు?"

"మిమ్మల్ని ప్రతీ క్షణం గమనించే వ్యక్తిని కాబట్టి-"

"మీకేం అవసరం వుందని- అలా?"

"ఆ విషయం అలా వుంచి- అసలు విషయానికి వద్దాం. మీరు పారిపోవాలనుకుంటున్నారు కదూ!"

"ఎవరు మీరు?"

"ఇందాకే చెప్పాను. 'నేను నేనే!' అని. మీరు పారిపోవాలనుకుంటున్నారు కాబట్టే- మీరు పారి



పోయే ఏర్పాటు చేస్తాను."

నాకు కోపం వచ్చింది. వీడెవడు నా స్వ విషయంలో- పానకంలో పుడకలా కల్పించుకోవడానికి-

"నేను ఎందుకు పారిపోవాలనుకుంటాను. ఇల్లు, సంసారం, మొగుడు, పిల్లలు, అత్త, ఆడబడుచు, మేనల్లుళ్ళు - ఇంత బలగాన్ని వదిలేసి -"

"సర్! మనసు మార్చుకున్నట్టున్నారు. ఈ సారి నిజంగా పారిపోవాలనుకున్నప్పుడు మళ్ళీ పలుకుతాను లెండి!" ఫోను పెట్టేసిన చప్పుడు.

'ఎవడువాడు! ఏవిటి వాడి గొడవ!' అని కాసేపు చిరాకుపడి, తిట్టుకుని అతడ్ని చిరాకుపడి తిట్టుకునేటంత ప్రాముఖ్యత ఇస్తున్నందుకు మళ్ళా నన్ను నేను చిరాకుపడి, తిట్టుకుని 'జబ్బు'ని మరింత పెంచుకుని ఆయాసపడ్డాను.

రాను రాను 'జబ్బు' మరింత పెరిగిపోవడంతో ఇక అన్నిటి మీద విరక్తి కలిగింది. ఆ విరక్తి పోను పోను అధికమవడంతో - ఇక పారిపోవడం ఒక్కటే మార్గం అనిపించింది.

ఇలా అనిపించిందో, లేదో అలా ఫోను.

విసుక్కుంటూ, వెళ్ళి ఫోను ఎత్తేసరికి -

చిర్నవ్వు గొంతుకతో - 'నేనే' అన్న స్వరం వినేసరికి మతిపోయినట్టయ్యింది. చిరాకు రెట్టింపయ్యింది.

"ఏవిటి?"

"పారి పోవాలనుకుంటున్నారుగా!"

"అయితే?!"

"నేను చెప్పానుగా - నేను మీరు పారిపోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తాను అని -!"

ఒక క్షణం - ఎలాగూ పారిపోవాలనుకుంటున్నప్పుడు పోనీ ఇతడే ఆ ఏర్పాట్లు భరిస్తా అన్నప్పుడు ఎందుకు - కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్టు



-"సరే కానీ ఎక్కడికి తీసికెళతారు నన్ను?"

"అదేమిటి పారిపోయే వాళ్ళకి 'ఎటు, ఏవిటి' అని గమ్యం, మార్గం వుంటాయా?"

"ఏర్పాట్లు వేస్తాను అంటున్నారు కాబట్టి - ఆ ఏర్పాట్లు ఏవిటో తెల్సుకోవడానికి -"

"అదే నేనూ అనేది. పారిపోయే వాళ్ళకి ఏర్పాట్లు తెల్సుకునే అవసరం, ఆవశ్యకత వుందంటారు?"

"నేను తెల్సుకుని తీరాలి -"

"అయితే చెబుతా, వినండి! ఒక అందమైన ఫారిన్ హోండా కారు మీ ఇంటి ముందు ఆగుతుంది. మీరది ఎక్కితే -"

"కట్టుగుడ్డలతోనా -?!"

"అవును. ఎక్కితే, అది చక్కగా జలపాతాల కొండల ప్రక్క నుంచి, పచ్చటిలోతుల్లోంచి - అందమైన ప్రకృతి రోడ్డు మీద మిమ్మల్ని అద్భుతమైన దీవికి తీసుకువెళుతుంది.

అక్కడ జనసంచారం వుండదు. చక్కటి, చిక్కటి, పచ్చటి, పల్లటి అడవి. అద్భుతమైన సువాసనలు వెదజల్లే అందమైన పూలతో, చెట్లతో, - పూలనావల్లా వుంటాయి.

ఆ చెట్ల మధ్య చక్కటి భవంతి. ఆ భవంతిలో వేసవి కాలం ఏ.సి, శీతాకాలం వెచ్చగా వుంటుంది.

నోరూరించే భక్ష్యాలు, చెవులకు ఇంపైన సంగీతం - మాటలు - హాయిని కలిగించే మెత్తటి పరుపులు, తివాచీలు, కుర్చీలు, సోఫాలు, ఉయ్యాల బల్లలు, మంచాలు - సువాసనలునిండిన వాతావరణం -

మీకు ఏది ఎలా ఎప్పుడు కావాలంటే అది ఆ క్షణంలో ప్రత్యక్షమవుతుంది.

"సుఖం తప్ప
సంతోషం తప్ప
ప్రశాంతత తప్ప
మరొకటి అక్కడ వుండదు - "

'ఈ వర్ణన వినగానే నాకు భయం వేసింది, ఒళ్ళు గగుర్పొడిచింది. అలాంటి చోట ఒక రోజూ - రెండు రోజులు - మూడు రోజులు - మహా అయితే వారం! కానీ జీవితాంతం వుండాలంటే - అమ్మో జగద్గురువులు కంచి శంకరాచార్యులే, ఆశ్రమాన్ని వదలి పారిపోయి తల కావేరిలో తల దాచుకుని - అక్కడ వుండలేక మళ్ళీ వచ్చెయ్యలేదా? నేనెంత?! అమ్మో -'

"నా వల్ల కాదు - " తెగేసినట్టు చెప్పా.

"అదేవిటి పారి పోవాలనుకున్నారుగా - "



"అప్పుడు. కానీ మీ వర్ణన విన్నాక మనసు మార్చుకున్నాను"

"మరి జబ్బు తగ్గేదెలా?"

"జబ్బుతోనైనా - ఇక్కడే మా 'మేళం'తో పడి వుంటానని - అమ్మో - ఆ సుఖం - ఆ సంతోషం, ఆ ప్రశాంతత నాకు వద్దు -"

"మీ ఆలోచనా ధోరణిలో క్రమం లోపించింది గమనించారా?!"

"ఏవిటి?"

"'జబ్బు' తో వుంటానంటున్నారు కానీ మీ చుట్టు ప్రక్కలే మీ 'జబ్బు' నయం చేసే డాక్టరు వున్నా - మీరు గమనించరేం?!"

"ఎక్కడ?! ఎక్కడ?!"

"ఒక్కసారి, మీ మేడ మీదికి వెళ్ళండి" ఫోను పెట్టేసి, పైకి వెళ్ళాను.

"అదిగో అలా ఆ ప్లాట్ ఫారమ్ వైపు చూడండి - "

ఉలిక్కిపడ్డాను. అదే గొంతు గాలిలో నుంచి తేలి వినిపిస్తోంది. కానీ ఎలా సాధ్యం? అనుకున్నా-

'నాకు ఏదైనా సాధ్యమే - ఫోను కేవలం మీ సౌకర్యం కోసం. కానీ నాకు అది ఆలంబనం కాదు. చూస్తున్నారా?"

"చూశాను. తెల్ల జుత్తుతో తన చుట్టూ వున్న ఎంతో మంది దీనులకు, ఆర్తులకు, దుఃఖితులకు, బాధాసర్పదష్టులకు - పైస చుట్టూ తిరుగుతున్న ఈ కమర్షియల్ ప్రపంచంలో - 'పైసా' తీసుకోకుండా వైద్యం చేస్తున్న, మందు లిస్తున్న ఆ డాక్టర్!

"నేను ఎన్నోసార్లు ఆయన్ని చూశాను"

"మరి ఎందరు వెళ్ళలేదు"

"ఏమో"

"మీ జబ్బు - అదే 'అసంతృప్తి' జబ్బు - అందరికీ ఏదో ఒకసారి ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగోలాగ వస్తుంది. దానికి కారణాలు సవా లక్ష - ఆ కారణాలు ప్రక్కన పెట్టి ఆ 'జబ్బు'కి మందు ఇచ్చే వ్యక్తుల్ని, మార్గాల్ని మనమే కనుక్కోవాలి. ప్రస్తుతం మీ జబ్బుకి కర్మ సాక్షి, కర్మయోగి అయిన ఆ డాక్టర్ మందు ఇస్తారు - "

"కానీ - మీరు మీ 'జబ్బు'కి వేరే వాళ్ళ దగ్గర మందు తెచ్చుకునే స్థాయి నుంచి జనం 'జబ్బు'కి మందు ఇచ్చే స్థాయికి ఎదగడానికి ప్రయత్నించండి. కానీ పారిపోవాలని ప్రయత్నించకండి-"

" అని ఆ స్వరం మాయమయ్యింది.

'నేను' మిగిలాను నా గురించి నేను తెల్సుకుంటా. ♦